

అమలుపై ఆశలు..!

- సిఎం ఐదు సంతకాలకు మంత్రివర్గ ఆమోదం
- మెగా డీఎస్సీతో పాటు పింఛన్ల పెంపు
- డీఎస్సీలో పోస్టులు పెంచాలని డిమాండ్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టిన సమయంలో సంతకం చేసిన ఐదు ఫైళ్లకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పింఛన్ల పెంపు, నైపుణ్య గణన, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వాటి అమలుపై జిల్లా వాసులు ఆశతో ఎదురుచూస్తున్నారు. డీఎస్సీలో పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేస్తున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర మంత్రివర్గం సోమవారం అమరావతిలోని సచివాలయంలో భేటీ అయింది. పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రిగా గురువారం నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన అనంతరం ఐదు ఫైళ్లపై సంతకాలు చేశారు. మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పింఛన్ల పెంపు, నైపుణ్య గణన, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ ఫైళ్లపై సంతకాలు చేసిన విషయం తెలిసిందే. ఆ ఫైళ్లకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 4వేల వరకూ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఐదేళ్లగా డీఎస్సీ నిర్వహించకపోవడంతో బిఎడ్, డిఎడ్ చేసిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ ప్రభుత్వం విడుదల చేయనున్న డీఎస్సీపై ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా లక్ష మంది వరకూ డీఎస్సీకి అర్హులైన అభ్యర్థులు ఉన్నారు. వైసిపి ప్రభుత్వం ఈ ఏడాది ఆరంభంలో వదిలిన డీఎస్సీలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు 1,543 పోస్టులు కేటాయించారు. టిడిపి ప్రభుత్వం విడుదల చేయనున్న మెగా డీఎస్సీలో ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రామాణికంగా ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. ఈ డీఎస్సీలో ఉమ్మడి జిల్లాకు 2300 నుంచి 2500 ఉపాధ్యాయ పోస్టులు వచ్చే అవకాశం ఉందని అంచనా. ప్రస్తుతం రాష్ట్రంలో 39 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, టిడిపి ప్రభుత్వం చేపట్టే డీఎస్సీ ద్వారా కనీసం 25వేల పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగులు, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.

సామాజిక పింఛన్లను రూ.3 వేల నుంచి రూ.4వేలకు పెంచడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పెంచిన పింఛన్లను జులై 1 నుంచి అమలు చేయనున్నారు. జులై 1న పెంచిన రూ.4వేలతో పాటు ఏప్రిల్ నుంచి 3 నెలలకు రూ.వెయ్యి చొప్పున కలిపి మొత్తం రూ.7వేలు లబ్ధిదారులకు అందజేయనున్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దనే లబ్ధిదారులకు పింఛన్ అందించేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ పింఛన్ల పెంపుతో కర్నూలు జిల్లాలో 2.45 లక్షల మందికి, నంద్యాల జిల్లాలో 2.24 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా అన్నా క్యాంటీన్లను తిరిగి ఏర్పాటు చేయనున్నారు.

25వేల పోస్టులను భర్తీ చేయాలి



గతంలో పార్లమెంటులో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రకటించిన వివరాల ప్రకారం రాష్ట్రంలో 39,008 ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిఒ 117 రద్దు చేస్తే మొత్తం 50 వేల ఉపాధ్యాయ పోస్టులు అవసరం అవుతుంది. కాబట్టి తక్షణమే పాఠశాలల విలీనానికి సంబంధించిన జీవో నెంబర్ 117ను రద్దు చేయాలి. అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలి. మొదట దఫా డిఎస్సీలో 25 వేల పోస్టులను భర్తీ చేయాలి. ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 సంవత్సరాలకు తగ్గించాలి. ఇతర శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నింటికీ నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేయాలి. మధ్యలోనే ఆగిపోయిన కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం చర్యలు తీసుకొని హోం శాఖలో ఖాళీగా ఉన్న 24 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలి. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చే వరకు నిరుద్యోగ భృతి నెలకు రూ.8వేలు చెల్లించాలి.

- వై.నగేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.

త్వరగా చట్టం రద్దుకు చర్యలు తీసుకోవాలి



ల్యాండ్ టైటిలింగ్ యాక్టులో అనే లొసుగులు ఉన్నాయి. భూమి విస్తీర్ణంలో తేడాలు వచ్చాయి. రైతులు దీనిపై తీవ్ర ఆందోళనలు ఉన్నాయి. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు ద్వారా హైకోర్టులో మాత్రమే అప్పీలు చేసుకోవాలని తెలిపారు. దాంతోనే వ్యతిరేకతతో వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు ఓటు వేశారు. రైతులకు ఉపయోగపడే మెరుగైన చట్టాన్ని తీసుకురావాలి. మంత్రివర్గం ఆమోదంతో సరిపెట్టకుండా ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలి.

- జి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

కుటుంబానికి కొంత ఆసరా



పింఛన్ రూ.4 వేలకు పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకం చేయడం చాలా సంతోషం. ఇప్పటి వరకూ రూ.3వేల పింఛన్ తీసుకునే వాన్ని. పెంచిన ఫించన్ వల్ల కుటుంబానికి కొంత ఆసరాగా ఉంటుంది. పింఛన్‌ను ఇబ్బంది లేకుండా అందించేలా నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- పి.పెద్ద ఖాసిం సాబ్, దేవనకొండ.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

అనే నేను...

- ఎంపీలుగా నాగరాజు, శబరి ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి


పార్లమెంట్ సభ్యులు(ఎంపీ)లుగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్‌లో వారితో ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ప్రమాణ స్వీకారం చేయించారు. " పంచలింగాల బస్తిపాటి నాగరాజు అనే నేను.., డాక్టర్ బైరెడ్డి శబరి అనే నేను.." అంటూ ఇద్దరూ తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ప్రొటెం స్పీకర్‌కు నమస్కారం చేసి, రిజిస్టర్‌లో సంతకం చేసి వారి సీటు వద్దకు వెళ్లారు.

గడువులోపు అర్జీలు పరిష్కరించాలి

- ఇన్‌ఛార్జి కలెక్టర్ నారపరెడ్డి మౌర్య
- ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో వినతులు స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను నారపురెడ్డి మౌర్య స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రజా సమస్యల పరిష్కారాల వేదిక ద్వారా 92 అర్జీలు వచ్చాయని, అందులో 69 అర్జీలు ప్రాసెస్‌లో ఉన్నాయన్నారు. సదరు అర్జీలు నిర్దేశిత గడువులోపు పరిష్కరించి క్లోజ్ చేయాలని, ఒకవేళ పరిష్కరించలేని అర్జీలు ఏవైనా ఉంటే వాటిని ఎందుచేత పరిష్కరించలేక పోతున్నామనే కారణాలు అర్జీదారులకు అర్థమయ్యే రీతిలో స్పష్టంగా తెలుపుతూ ఎండార్స్ చేయాలన్నారు. అర్జీలను పరిష్కరించడంలో ఎటువంటి అలసత్వం వహించకూడదన్నారు. అదే విధంగా ఇప్పటివరకు 8 అర్జీలు రీఓపెన్ అయ్యాయని, అందులో రెవెన్యూ 4, పంచాయతీ రాజ్ 2, పోలీస్ 1, సర్వేకు సంబంధించి 1 రీఓపెన్ అయ్యాయని వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అర్జీదారుడు ఇచ్చిన అర్జీ బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా సరైన రీతిలో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ మధుసూదన్ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగ ప్రసన్నలక్ష్మీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ సృజన

విధులను బాధ్యతతో నిర్వర్తించాలి

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నూతనంగా ఏర్పడిన ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు విధులను బాధ్యతతో నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్లనున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులనుద్దేశించి మాట్లాడారు.. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో కలెక్టర్ గా విధులను సమర్థవంతంగా నిర్వహించడంలో ప్రతి ఒక్క అధికారి ఎంతగానో సహకరించారని, అదే విధంగా సాధారణ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ జిల్లా కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. గతంలో నేనెప్పుడూ రాయలసీమ ప్రాంతంలో పనిచేయలేదని, గత 14 నెలలుగా కర్నూలు జిల్లాలో కలెక్టర్ గా విధులు నిర్వర్తించానన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్లనున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ బాధ్యతలను జాయింట్ కలెక్టర్‌కు అప్పగించామన్నారు. కర్నూలు నుండి వివిధ కార్యాలయ అవసరాల నిమిత్తం విజయవాడకు వచ్చే అధికారులు ఎవరైనా అక్కడికి వచ్చినప్పుడు తనను కలిస్తే సంతోషంగా భావిస్తానన్నారు. తదనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి వినతులను కలెక్టర్ స్వీకరించారు.. అనంతరం జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యకు జిల్లా ఇన్చార్జి కలెక్టర్ బాధ్యతలు అప్పగించి కలెక్టర్ రిలీవ్ అయ్యారు. జెసి నారపురెడ్డి మౌర్య, డిఆర్ఒ మధుసూదన్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను కాపాడండి

- పాఠశాలల సమస్యలను పరిష్కరించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడండి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలను కాపాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో సిపిఎం జిల్లా స్థాయి సమావేశాలలో భాగంగా రెండవ రోజు సమావేశం సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి. ఆనంద్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్, దడాల సుబ్బారావ్ మాట్లాడారు. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల వల్ల వివిధ ప్రాంతాలలో పారిశుధ్య లేమి కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెంది ప్రజలు అతిసారా బారిన పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే అన్ని జిల్లాల అధికారులను మేల్కొలిపి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలన్నారు. వ్యాధి బారిన పడిన ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలన్నారు. సురక్షిత మంచినీటిని అందించాలన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమైందని ప్రభుత్వ విద్య పట్ల ప్రజలకు ఉన్న అపనమ్మకాన్ని తొలగించే విధంగా విద్యా శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. నూతన ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా టీచర్ల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిందని, అయితే ఒక విద్యాశాఖలోనే 30 వేల ఖాళీ పోస్టులు ఉన్నట్లు తెలుస్తోందన్నారు. దేశ భావితర భవిష్యత్తు తయారవుతున్న విద్యాలయాల్లో ఎలాంటి అసౌకర్యాలకు తావు లేకుండా సౌకర్యాలను కల్పించాలన్నారు. పరిసరాల శుభ్రత లోను, ప్రజలకు వైద్య సేవలు అందించడంలోనూ ప్రతి సిపిఎం కార్యకర్త ప్రజలకు ఒక సేవకుడిలా పనిచేయాలన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు ఇ. పుల్లారెడ్డి, జెఎన్. శేషయ్య, జె.నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాజశేఖర్, టి.రాముడు, వై.నగేష్, అరుణమ్మ, ఎన్.అలివేలు, గురుశేఖర్, విజయ్, మధు, నాయకులు గఫూర్ మియా, పిబి హుస్సేనయ్య, నాగన్న వివిధ మండలాలు, పట్టణాల నుండి హాజరైన నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంభూపాల్



శామ్యూల్‌కు అభినందనలు తెలుపుతున్న అధికారులు

ఎస్ఎస్ఎ ఎపిసిగా కె.శామ్యూల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కె.శామ్యూల్ సోమవారం సాయంత్రం అదనపు బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం పని చేస్తున్న ఎపిసి విజయ్ జ్యోతి కుమారిని రిలీవ్ చేసి సొంత రెవెన్యూ శాఖకు పంపడంతో ఆమె స్థానంలో జిల్లా విద్యాశాఖ అధికారికి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిఇఒకు విద్యాశాఖ ఎడిలు సామ్యూల్ ,శ్రీనివాసులు కార్యాలయ సూపరిండెంట్లు కోటేశ్వరరావు, రాజశేఖర్, సెక్టోరియల్ అధికారులు కలిసి అభినందనలు తెలిపారు.

ఎస్‌సి హాస్టల్‌లో మౌలిక వసతులు కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని స్థానిక ఇందిరా గాంధీనగర్‌లోని ఎస్సి మేనేజ్‌మెంట్ హాస్టల్‌లో సరైన మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప అబ్దుల్లా డిమాండ్ చేశారు. సోమవారం ఇన్‌ఛార్జి కలెక్టర్ నారపరెడ్డి మౌర్య ను కలిసి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుండి తమ చదువుల కోసం పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు కర్నూలులోని సంక్షేమ హాస్టల్లో మౌలిక వసతులు ఉంటాయని వస్తే ఇక్కడ మాత్రం వార్డెన్లు కనీస వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు, మంచి ఆహారం కూడా విద్యార్థులకు అందించటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ విద్యార్థులు వీరేష్ రాజు అంజి తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటలకు ప్రభుత్వం పూర్తిస్థాయి సబ్సిడీ

ప్రజాశక్తి- సి బెళగల్



పండ్ల తోటల పెంపకంపైనా, సాగులపైనా ఆసక్తి పెంచుకోవాలని ప్రభుత్వం 100శాతం సబ్సిడీ అందిస్తుందని మండలంలోని రైతులకు జిల్లా హార్టికల్చర్ అధికారిణి సుజాత పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పలుకుదొడ్డి, చింతమానుపల్లి, సిబెళగల్ గ్రామాల్లో మల్లెపూల తోటను పరిశీలించారు. ఇక్కడే జామ, సపోట, కొబ్బరి, చీని, దానిమ్మ, నిమ్మ, మల్లెపూలు, డ్రాగన్ ఫ్రూట్స్, మునగ, వంటివి సాగులపై ఆసక్తి గల రైతులకు అవగాహన కల్పించారు. ఇక్కడే సాగు చేసుకొంటే పూర్తి స్థాయిలో ఆదుకోంటుందని అన్నారు. ఈమె వెంట ఎపిఒ లక్ష్మన్న, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



డయేరియా నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-సి బెళగల్


డయేరియా నివారణకు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం మనకంతా ఉందని ఎంపిడిఒ శకుంతల పేర్కొన్నారు. సోమవారం సీజనల్ వ్యాధులపై ఇఒఆర్‌డి సందీప్, వైద్యులు ప్రసాద్ రెడ్డి, సిహెచ్ఒ ఉమామహేశ్వరమ్మ, సిబ్బంది మద్దిలేటి, మంగమ్మల సమక్షంలో సర్పంచులను, ఎంపిటిసిలను, కార్యదర్శులను, గ్రామస్థాయి వైద్య సిబ్బందిని సమీక్షించి ఆమె మాట్లాడారు. వర్షాలు పడుతున్నందున భూమిలోకి కొత్తనీరు చేరి అవి తాగుటవలన ప్రజలకు సీజనల్ వ్యాధులు సంభవించక తప్పదన్నారు. ఇక్కడే గ్రామాల్లో పారిశుధ్య లోపాలపై దృష్టి సారించి బ్లీచింగ్ పౌడర్ లాంటివి చల్లించి క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ప్రజలకు సురక్షితమైన నీటినే అందించాలన్నారు.

వ్యాపార రంగం విస్తరించాలి

సినీ నటుడు సుమన్

ప్రజాశక్తి-పత్తికొండ


పత్తికొండ ప్రాంతంలో పెట్టుబడుదారుల ద్వారా వ్యాపార రంగాలు విస్తరించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సినీ నటుడు హీరో సుమన్ పేర్కొన్నారు. పత్తికొండ పట్టణంలోని వైవి రాఘవరెడ్డి కాంప్లెక్స్‌లో ఎద్దుల కాటన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కాటన్ దుస్తుల షాపింగ్ మాల్ ను సోమవారం సినీ నటుడు సుమన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సినీ నటుడు హీరో సుమన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎద్దుల ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కాటన్ దుస్తులు షాపింగ్ మాల్ ప్రారంభించడం శుభ పరిణామం అన్నారు. కర్నూలు జిల్లాలోని అత్యంత వెనుకబడిన ప్రాంతం పత్తికొండలో కాటన్ దుస్తుల షాపింగ్ మాల్ ప్రారంభించి స్థానికులకే యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. వ్యాపారరంగం దిన దినాభివద్ధి చెంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. సరసమైన ధరలకే నాణ్యమైన దుస్తులను ఏర్పాటు చేయడం చాలా సంతోషమన్నారు. ఈ అవకాశాన్ని పత్తికొండ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎద్దుల కాటన్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ ఎద్దుల మహేశ్వర్ రెడ్డి ,డైరెక్టర్లు ఎద్దుల సూర్యారెడ్డి ,ఎద్దుల సత్యారెడ్డి, టిడిపి నాయకులు సాంబశివారెడ్డి , కె.పి బ్రహ్మయ్య సోమలింగడు, రామానాయుడు, సోమ్లా నాయక్ బిటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సినీ నటుడు సుమన్

రవాణారంగ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.నరసింహులు

ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని లారీ డ్రైవర్లందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు న్యూసిటీ అధ్యక్షులు ఆర్. నరసింహలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు జిల్లా మోటార్ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దుర్గా హోటల్ సమీపంలోని మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలోఅ యూనియన్ జిల్లా నాయకులు రియాజ్ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్, సిఐటియు న్యూ సిటీ నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు మాట్లాడుతూ అసంఘటితరంగ కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ప్రభుత్వం నిర్ణయించాలని కోరారు. ముఖ్యంగా దేశానికి రవాణా రంగానికి వెన్నెముకగా ఉన్న రవాణా డ్రైవర్లకు, లారీ డ్రైవర్లకు తప్పనిసరిగా కనీస వేతనం అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో కనీస వేతనం అమలు చేయాలని, కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, అనేక పోరాటాలు నిర్వహించినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. రవాణా రంగానికి గుదిబండలాగా మారిన మోటార్ ఆక్ట్ సవరణ బిల్లులోని జీవో నెంబర్ 21, హిట్ అండ్ రన్ చట్టాలను తక్షణమే రద్దు చేయాలని వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.వీటివల్ల డ్రైవర్లు జైలు పాలయి వారి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు విద్యార్థుల ఫీజులు ఇలా అనేక రకాల ఖర్చులు పెరిగినందున చాలీచాలని ఆదాయంతో డ్రైవర్లు జీవితాలను గడుపుతున్నారన్నారు. వీటిపై పోరాటాలను ఉధృతం చేయాలని పోరాటాలలో రవాణా రంగ డ్రైవర్ల అందరూ పాల్గొనాలని కోరారు. మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు గంగాధర్. మోటార్ వర్కర్స్ యూనియన్ నగర నాయకులు. వలి, తిమ్మప్ప, దస్తగిరి నరేంద్ర, శీను, కొండ, సమీర్ ఇంకా అనేకమంది లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



రాష్ట్ర ఐటీ, విద్యా, ఆర్‌టిసి శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేశ్‌ను పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టిజి భరత్ మర్యాద పూర్వంగా కలిశారు. నారా లోకేశ్‌కు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రైతు ఉత్పత్తిదారుల సంస్థకు సహకరిస్తాం : సిపిఎం

ప్రజాశక్తి-మద్దికేర : నాబార్డ్ ఆధ్వర్యంలో అమలవుతున్న రైతు ఉత్పత్తి దారుల సంస్థకు సహకరిస్తామని సిపిఎం మండల కార్యదర్శి కడవల రవికుమార్ అన్నారు. మద్దికేరలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలో మండలంలో ఉన్న కొంత మంది రైతులు రూ.1000 చొప్పున సభ్యత్వం కట్టి ఎఫ్‌పిఒలో చేరారన్నారు. సభ్యత్వం కట్టిన రైతులకు ఎఫ్‌పిఒ గురించి సంబంధిత అధికారులు ఎలాంటి అవగాహన కల్పించడం లేదన్నారు. సభ్యత్వం ఉన్న మెంబర్లకు తెలియకుండా జిల్లా అధికారులు గ్రామాలలో ఎలా పరివేక్షిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రైతు ఉత్పత్తిదారుల సంస్థపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.



వినతులు స్వీకరించి సమస్యలు వింటున్న ఎస్‌పి జి.కృష్ణకాంత్

విచారించి న్యాయం చేస్తాం : ఎస్‌పి

పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టంకు 54 ఫిర్యాదులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు కొత్తపేటలోని కర్నూలు టూటౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్‌పి జి.కృష్ణ కాంత్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్‌పి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 54 ఫిర్యాదులు వచ్చాయి.

నిందితుల అరెస్టు అభినందనీయం

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్



ప్రకాశం జిల్లా చీరాల మండలం ఈపురుపాలెంలో బహిర్భూమికి వెళ్లిన సుచరిత అనే మహిళపై ముగ్గురు యువకులు ఆమెను అత్యాచారం చేసి హత్య చేసిని నిందితులను 36 గంటల్లో అరెస్టు చేయడం అభినందనీయమని టిడిపి నంద్యాల జిల్లాఅధ్యక్షులు కె.పార్వతమ్మ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , హోంమంత్రి వంగలపూడి అనిత వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి 48 గంటల్లోపే నిందితులను పట్టుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారని, 36 గంటల లోపే నిందితులను అరెస్ట్ చేశారని తెలిపారు. వీకర్ సెక్షన్ కాలనీ లోని తమ కార్యాలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో హోం మంత్రిగా పనిచేసిన ఏ ఒక్కరూ మహిళలపై ఈ అఘాయిత్యాలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. టిడిపి వచ్చిన తరువాత వంగలపూడి అనిత హోంశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొన్ని గంటలలోపే ఇలాంటి కఠిన చర్యలు తీసుకుని బాధితులను పట్టుకొని వెంటనే అరెస్టు చేయించి మహిళలపై ఎంతో బాధ్యతతో ప్రవర్తించారన్నారు. మంత్రి అనితకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మంత్రి పరిటాల సునీత కూడా ఈ విషయంపై హోం మంత్రి వంగలపూడి అనితతో మాట్లాడారనిఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లప్ప

మెగా డీఎస్సీ ఆమోదంపై హర్షం

- అప్రెంటీస్ విధానం లేని నోటిఫికేషన్ ఇవ్వాలని యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులను భర్తీ చేసేందుకు కేబినెట్ ఆమోదం పొందడంపై యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.నాగమణి, జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.దావీదు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జె.ఎల్లప్ప హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎం.రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు మెగా డీఎస్సీ పేరుతో 6,100 ఉపాధ్యాయుల నియమాకం కోసం డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించిందని తెలిపారు. ఆ నోటిఫికేషన్‌లో నియామకం పొందిన ఉపాధ్యాయులు రెండేళ్ల అప్రెంటీస్ సర్వీస్ చేయాలని షరతు పెట్టారని చెప్పారు. అనేక పోరాటాలు ఉద్యమాల రద్దు చేయించుకున్న అప్రెంటీస్ విధానాన్ని తిరిగి పునరుద్ధరించడం అత్యంత దుర్మార్గమని, దీనిపై గత ప్రభుత్వంపై నిరసన తెలియజేసినా అమలు చేసేందుకే నిర్ణయించుకుందని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అప్రెంటీస్ విధానం లేని మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామనిఎన్నికల ముందు ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ పోస్టులను కేబినెట్ ఆమోదించడం యుటిఎఫ్ హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వం ఇచ్చే డీఎస్సీ నోటిఫికేషన్‌లో అప్రెంటీస్ విధానం లేని రెగ్యులర్ ఉపాధ్యాయుల నియమాకం చేపట్టాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ నాయకులు ఎం.నాగరాజు, లతీఫ్, బిజి.మాదన్న, బి.రామాంజనేయులు, హనీఫ్, సంపత్, మంజునాథ్, కృష్ణ, ఎం.భీమేష్, కె.నాగరాజు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించడమే

'నేను బడికి పోతా' లక్ష్యం

- ఎంఇఒ-2 నీలకంఠ

ప్రజాశక్తి - గోనెగండ్ల



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బడికిరాకుండా బడి బయట ఉన్న బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించడమే 'నేను బడికి పోతా' కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఎంఇఒ-2 నీలకంఠ తెలిపారు. సోమవారం గోనెగండ్లతోపాటు మండలంలోని చిన్నమరివీడు, పెద్దమరివీడు గ్రామాల్లో 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గోనెగండ్లలోని బస్టాండ్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, సిబ్బంది స్థానిక 1వ వార్డు మొట్టి వీధిలో 'పెద్దలు పనికి.. పిల్లలు బడికి, పిల్లల చదువు భవితకు వెలుగు' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 నీలకంఠ మాట్లాడారు. ఈనెల 13 నుంచి జులై 12 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా బడి వయస్సు పిల్లలను గుర్తించడం, వారిని పాఠశాలలో చేర్పించడం, వారికి స్టూడెంట్ కిట్స్, ఇతర ప్రోత్సాహకాలు అందిస్తారని చెప్పారు. బడి వయసు పిల్లలందరినీ బడిలో చేర్పించి, బడి బయట పిల్లలు లేని గ్రామంగా ప్రకటించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. బస్టాండ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రహమతుల్లా, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, అంగన్వాడీ టీచర్ పుష్పావతి, సిఆర్‌పి శ్రీనివాసులు పాల్గొన్నారు.

సినీ నటుడు సుమన్ సందడి

ప్రజాశక్తి- దేవనకొండ



ఫొటోలు దిగుతున్న అభిమానులు

సినీ నటుడు సుమన్ దేవనకొండలో సందడి చేశారు. పత్తికొండ పట్టణంలో క్లాత్ షోరూం ప్రారంభోత్సవా నికి వచ్చిన ఆయన తిరుగు ప్రయాణంలో దేవనకొండ మీదుగా వెళ్తుండగా శ్రీలక్ష్మీ రంగా కల్యాణ మండపం వద్ద టిడిపి నాయకులు బడిగింజల రంగన్న, మలకన్న, వెలమకూర్ సర్పంచి భాస్కర్, బజాజ్ షోరూం ఫజుల్ బాష, అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షులు వేణు మహారాజ్ ఆధ్వర్యంలో అభిమానులు సందడి చేశారు. ఈ సందర్భంగా సుమన్‌ను పూలమాల, శాలువాలతో సన్మానించారు. టిడిపి నాయకులు రాజశేఖర్ గౌడ్, గిడ్డయ్య గౌడ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- సిపిఎం నాయకులు - మున్సిపల్ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలోని 32వ వార్డు రాఘవేంద్ర నగర్, సంజీవ్ నగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో వార్డు ప్రజలను సమీకరించి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ కలిసి కమిషనర్‌ను అడ్డుకొని తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఎం నాయకులు పి.గోవిందు, బి.రాముడు, ఎం.అబ్దుల్లా, వి.తిమ్మప్ప మాట్లాడారు. 15 ఏళ్లుగా రాఘవేంద్ర నగర్ కాలనీలో తాగునీటి సమస్యతో బాధపడుతున్న ప్రజలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాఘవేంద్ర నగర్‌లో నివసించే ప్రజలు రోజువారీ కూలిపైన జీవనం సాగిస్తున్నారని తెలిపారు. నీటి సమస్యను పరిష్కరించడానికి ఇటీవల కాలంలో ట్రాక్టర్ ట్యాంకులతో నీటిని ప్రజలకు అందిస్తున్నామని అధికారులు చెబుతున్నారని, అక్కడి ప్రజలకు సరిపోయేలా నీటిని అందించడం లేదని చెప్పారు. రాఘవేంద్ర నగర్‌లో బోర్లు వేస్తే ఫ్లోరైడ్ నీరు పడుతోందని, ఇది ప్రజల ఆరోగ్యానికి హానికరమని తెలిపారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని గత ఎన్నికల కంటే ముందు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందించినట్లు చెప్పారు. రాఘవేంద్ర నగర్‌కు పైపులైన్ వేయడానికి సిద్ధంగా ఉన్నామని, అతి త్వరలో పైపులైన్ పూర్తి చేసి తాగునీటిని ప్రతి ఇంటికీ సంపూర్ణంగా అందజేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటివరకు పైపులైన్ వేయకపోగా ట్యాంకర్లతో అందించే నీళ్లు అందరికీ అందడం లేదని ప్రజలు కమిషనర్‌తో వాపోయారు. తాగునీటి సమస్యను పరిష్కరించడానికి పైపులైన్ వేయకుండా ఆలస్యం చేస్తే ప్రజలు పోరాటబాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రజలందరినీ సమీకరించి వంటావార్పు కార్యక్రమం చేపడతామని తెలిపారు. ఎమ్మిగనూరు మున్సిపాలిటీ గ్రేడ్ వన్ స్థాయిలో ఉన్నా ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించకపోవడం, రోజువారీ కూలికి వెళ్లే రోజు కూలీలు నీటి కోసం కూలిని వదులుకొని పస్తులు ఉండాల్సిన పరిస్థితి కల్పించారని విమర్శించారు. కమిషనర్ స్పందించి రాఘవేంద్ర నగర్‌కు పైపులైన్లు వేసి ప్రతి ఇంటికీ ఉచిత కుళాయి ఇచ్చి సమస్యను పరిష్కరించాలని కోరారు. పట్టణంలో నీటి పన్ను సంవత్సరానికి రూ.3 కోట్లు వసూలు అవుతోందని తెలిపారు. ఈ నిధులతో తక్షణమే రాఘవేంద్ర నగర్ దాహార్తిని తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ముట్టడిలో రాఘవేంద్ర నగర్ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ముందు మహిళలతో నిరసన తెలియజేస్తున్న సిపిఎం నాయకులు

రెండేళ్లలోపు ప్రహరీ నిర్మాణం

- టిడిపి యువ నాయకులు రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని రచ్చుమర్రి గ్రామ సమీపంలో ఉన్న మోడల్ స్కూల్‌కు రెండేళ్లలోపు ప్రహరీ నిర్మిస్తామని టిడిపి నాయకులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి సోదరులు, యువ నాయకులు ఎన్.రామకృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి విద్యార్థులకు మంజూరైన కొత్త కిట్లను సోమవారం మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ప్రసాద్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు పౌష్టికాహారం అందించాలని కోరారు. రచ్చుమర్రి గ్రామ నాయకులు బిఆర్.నరసింహులు, పోలి శివప్ప, పోలి వీరేష్, కోసిగి హుస్సేని, తలారి హనుమంతు, రామయ్య, చిదానంద, కురువ మల్లయ్య, వెంకటరాముడు, యాగంటి ఈరన్న, గంగన్నగారి ఈరప్ప, మేకల నారాయణ, ఆదోని బంగారయ్య పాల్గొన్నారు.



కిట్లు అందుకున్న విద్యార్థులతో, పాఠశాల సిబ్బందితో రామకృష్ణారెడ్డి



పుస్తకాలు, మెటీరియల్ అందజేస్తున్న మీనాక్షి నాయుడు

క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలి

- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని, క్రమశిక్షణతో చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనాక్షి నాయుడు విద్యార్థులకు సూచించారు. సోమవారం ఆదోనిలోని 20వ వార్డు మండిగిరి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వార్డు ఇన్‌ఛార్జి శ్రీనివాసులు స్వంత ఖర్చులతో నోట్ పుస్తకాలు, బాక్సులు మీనాక్షి నాయుడు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలోనే భవిష్యత్తు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. పేద విద్యార్థులకు తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు భాస్కర్ ఆచారి, సీనియర్ నాయకులు బుద్దారెడ్డి, బాలాజీ, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

బాధ్యతయుతంగా విధులు చేపట్టండి

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

బాధ్యతయుతంగా విధులు నిర్వహించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు అందజేయాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఏ అధికారి కూడా నిర్లక్ష్యం చేయకుండా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తిపరిచేలా చూడాలని ఆదేశించారు. అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా చూడాలని తెలిపారు.

సమస్యలు : ఆదోని మండలం మండగిరి పంచాయతీకి చెందిన అనీష్ ఫాతిమాకు సంబంధించి సర్వే నెంబర్ 204/బి1లో 3.70 ఎకరాల భూమికి సంబంధించి ఆన్‌లైన్, పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరారు. 'ఆదోని పట్టణం కల్లుబావి విధిలో గత 40 ఏళ్లుగా నివాసం ఉంటున్నాం. ఇంటి స్థలానికి సంబంధించి ఎలాంటి పత్రాలూ లేవు. పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాల'ని ఆ ప్రాంతానికి చెందిన బాలరాజు వినతిపత్రం అందజేశారు. 'టిడ్కో ఇంటి కోసం గతంలో రూ.లక్ష బ్యాంకరు డిడి ద్వారా చెల్లించాం. ప్రస్తుతం మాకు ఎలాంటి టిడ్కో గృహం మంజూరు కాలేదు. బ్యాంకు డిడి ద్వారా చెల్లించిన నగదును తిరిగి ఇవ్వాల'ని ఆదోని పట్టణం ఆర్‌టిసి కాలనీకి చెందిన దాసరి యశోద కోరారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి తన కుమార్తె వెన్నెలకు 8వ తరగతి బదులుగా 6వ తరగతి అని తప్పుగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, కస్తూర్బా గాంధీ పాఠశాలలో 8వ తరగతి అడ్మిషన్ మంజూరు కాలేదని, తన కుమార్తెకు 8వ తరగతి అడ్మిషన్ మంజూరు చేయాలని ఆదోని మండలం గోనబావి గ్రామానికి చెందిన పకీరప్పకు కోరారు. కార్యాలయపు పరిపాలన అధికారి సిఆర్.శేషయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, డిఎల్‌పిఒ నూర్జహాన్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకట ప్రసాద్, ఆర్‌టిఒ నాగేంద్ర, డిఎల్‌డిఒ నాగేశ్వరరావు ఉన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

వైసిపి కార్యాలయానికి నోటీసులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని వైసిపి కార్యాలయానికి నోటీసులు జారీ చేశామని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. పట్టణంలోని ఎస్‌కెడి కాలనీలో మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగిందన్నారు. ఆ భవంతులో ప్రస్తుతం వైసిపి కార్యాలయంగా కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. నిర్మాణానికి సరైన అనుమతులు లేకపోవడం, అందుకు కావాల్సిన ఫీజు చెల్లించకపోవడంతో ఈ చర్యలు తీసుకున్నామన్నారు. మంగళవారం రెవెన్యూ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల సమక్షంలో భవనాన్ని సీజ్ చేస్తున్నట్లు తెలిపారు.

పిఎం కిసాన్ వర్తించని

రైతుల సమస్యలు పరిష్కరించండి

- ఎఒ జయలక్ష్మి

ప్రజాశక్తి - చిప్పగిరి



మాట్లాడుతున్న ఎఒ

పిఎం కిసాన్ నిధులు వర్తించని రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎఒ జయలక్ష్మి అగ్రికల్చర్ అసిస్టెంట్లకు సూచించారు. సోమవారం చిప్పగిరి వ్యవసాయ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఈనెల 18న పిఎం కిసాన్ నిధులను రైతుల ఖాతాలకు జమ చేసిందని తెలిపారు. అర్హత ఉన్నా పిఎం కిసాన్ రాని రైతులు చాలా మంది ఉన్నారని చెప్పారు. వారంతా దగ్గరలో ఉన్న అగ్రికల్చర్ అధికారులను సంప్రదించి వారు చెప్పిన వివరాల మేరకు ఫేస్ యాప్, వేలితంబు, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నెంబర్, తప్పులు లేకుండా బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీని అందించి సమస్యలను పరిష్కరించుకోవాలని రైతులను కోరారు. ఎఇఒ రమాదేవి, అగ్రికల్చర్ అసిస్టెంట్లు ప్రతాప్ నాయుడు, రాకేష్, రంగస్వామి, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహశీల్దార్ కార్యాలయంలో జిల్లా అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ పద్మజ, డిటి ఇజాజ్ అహ్మద్, పరిపాలన, ఫిర్యాదుల అధికారి శ్రీనివాసులు, ఎంఇఒ సావిత్రమ్మ, ఎఒ జయలక్ష్మి, ఎపిఎం నాగార్జున, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

- టిడిపి నాయకులు రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

వైసిపి గ్రూపు దాడిలో గాయపడిన బాధితులకు అండగా ఉంటామని టిడిపి నాయకులు ఎన్.రామకృష్ణారెడ్డి భరోసా ఇచ్చారు. ఆదివారం వైసిపి మూకల దాడిలో తీవ్రంగా గాయపడిన రాముడు, క్యాతయ్యను సోమవారం మండలంలోని సౌలహళ్లి గ్రామంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి వారు చేసే అరాచకాలకు అడ్డు, అదుపు లేకుండా పోయిందని తెలిపారు. దాడి చేసిన వారిని చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాధితులు రామయ్యకు, క్యాతయ్యకు అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని సూచించారు. టిడిపి నాయకులు అంజి, రాముడు, వీరాంజి, రామాంజి, వీరేష్, వీరన్న ఉన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న రామకృష్ణారెడ్డి

అన్నదాత పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- వెన్నెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ సతీష్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని



అన్నదాత పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెన్నెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ బి.సతీష్ కుమార్ సూచించారు. సోమవారం ఆదోనిలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రూ.5 లక్షల వరకు బీమా ప్రయోజనం, సులభరీతిలో నిత్యావసర వస్తువుల కొనుగోలు, కిసాన్ క్యాంటీన్ కార్డ్ స్కీంతో రైతులు అవసరమైన వస్తువులపై 5 నుంచి 40 శాతం తగ్గింపును పొందవచ్చని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఆధార్ కార్డు, బ్యాంక్ పాసు పుస్తకం, రేషన్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, మొబైల్ నెంబర్, పాన్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం సమర్పించాలని కోరారు. ఇతర వివరాలకు 9966096136 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

నదీ పోరంబోకు భూమిని స్వాధీనం చేసుకోవాలి : సిపిఐ

ప్రజాశక్తి - మంత్రాలయం

శ్రీమఠం ఆధీనంలోని నదీ పోరంబోకు భూమిని స్వాధీనం చేసుకోవాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా తహశీల్దార్ శ్రీధర్ మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నదీ పోరంబోకు సర్వే నెంబరు 1లో గల 674/31 ఎకరాలు ఉందని, అందులో శ్రీమఠం యాజమాన్యం ఆధ్వర్యంలో వసతి గృహాలు, దుకాణాలు వంటివి నిర్మించడమే కాకుండా గతంలో పాత ఊరులోకి వెళ్లే రస్తాను కూడా ఆక్రమించారని తెలిపారు. ప్రజావసరాల నిమిత్తం ప్రభుత్వం నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలను తొలగించాలని శ్రీమఠం యాజమాన్యం నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. ఇలాంటి భూములను సర్వే చేయాలని వినతిపత్రం ద్వారా కోరామని, తమ పలుకుబడితో గ్రామంలో సర్వే జరగకుండా చేస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి సర్వే చేసి భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. వీరేష్, మహ్మద్, హనీఫ్, నరసింహులు, శివ, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఐసిడిఎస్ అధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

ఆలూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన బుసినే విరుపాక్షిని చిప్పగిరిలోని వారి స్వగృహంలో ఐసిడిఎస్ అధికారులు కలిశారు. సోమవారం ఐసిడిఎస్ సిడిపిఒ మద్దమ్మ, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది విరుపాక్షికి పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడారు. ఐసిడిఎస్ అధికారుల సమస్యలను శాసనసభలో మాట్లాడి ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. విధుల్లో మంచి ప్రతిభ కనబరిచి మహిళలకు న్యాయం చేసే బాధ్యత ఉందన్నారు. ఏమైన సమస్యలుంటే ఎప్పుడైనా సరే తన దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. సూపర్‌వైజర్లు పద్మావతి, ప్రసూన, చంద్రావతి, ఈరమ్మ, అంగన్వాడీ టీచర్లు హరిత, పుల్లమ్మ, రామ తులసి, పద్మ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విరుపాక్షికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఐసిడిఎస్ అధికారులు

డయేరియాపై అప్రమత్తత అవసరం

- డాక్టర్ గోవిందమ్మ, ఎఇ వేదస్వరూప


ప్రజాశక్తి - మంత్రాలయం

డయేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని కలుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ గోవిందమ్మ, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎఇ వేదస్వరూప సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇఒఆర్‌డి ప్రభావతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ నీటిని వేడి చేసి వడబోసి చల్లార్చి తాగాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోని నీటిని సరఫరా చేసే ట్యాంకులను శుభ్రం చేసి నీటిని పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆరోగ్య సిబ్బంది జులై 1 నుంచి 30 వరకు ప్రతి గ్రామంలోని ఇంటింటికీ తిరిగి ఐదేళ్లలోపు పిల్లలను సర్వే ద్వారా గుర్తించి డయేరియా లక్షణాలను గుర్తించాలని, అవసరమైన వారికి ఒఆర్ఎస్ పౌడర్‌ను ఇవ్వాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. పిహెచ్‌సి సూపర్‌వైజర్ మాధవస్వామి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం : ఇఒఆర్‌డి

ప్రజాశక్తి - నందవరం

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అందుకు పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఇఒఆర్‌డి ఈశ్వరయ్య స్వామి తెలిపారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సీజనల్ వ్యాధులపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటిని వేడి చేసి, చల్లార్చిన తర్వాతనే తాగాలని తెలిపారు. గ్రామాల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు మురుగునీటి కాలువలను శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని కోరారు. డాక్టర్ శ్రీలేఖ, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ముగతి సర్పంచి విరుపాక్షి రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకట రాములు, గురజాల సర్పంచి వీరస్వామి, నందవరం సర్పంచి తోట సావిత్రి, ఎంఇఒ రఘునాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇఒఆర్‌డి ఈశ్వరయ్య స్వామి

సేవా దృక్పథం అలవరచుకోవాలి

- ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష

ప్రజాశక్తి కౌతాళం

మానవ సేవే మాధవ సేవ అని, విద్యార్థి దశలోని సేవ దృక్పథం అలవరచుకోవాలని ప్రతిభ హై స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష తెలిపారు. సోమవారం ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 2024-25 విద్యా సంవత్సరం సందర్భంగా ఆదోనిలోని జీవనజ్యోతి వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు రెండో తరగతి విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం తరపున పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆశ్రమ నిర్వాహకులు విక్టర్ పాల్ ఫిలిప్‌కు రూ.5వేలు విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మంచి గుణాలు కలుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు మొదటి బడి అమ్మ ఒడి అని, తల్లిదండ్రులు కూడా నైతిక విలువలు కలిగేలా వారిని తీర్చిదిద్దాలని కోరారు. అప్పుడే ప్రతి విద్యార్థి కుటుంబ సభ్యులతో పాటు సామాజిక సేవ దృక్పథంలో ముందు ఉంటారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు భారతి, రాధిక, రెండో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.



పండ్లను పంపిణీ చేస్తున్న సయ్యద్ దూద్ బాష

జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య సౌకర్యం కల్పించాలి

- ఎపియుడబ్ల్యుజె డిమాండ్

ప్రజాశక్తి - మంత్రాలయం

విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య సౌకర్యం కల్పించాలని ఎపియుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షులు చాంద్ బాషా, తాలూకా అధ్యక్షులు జయరాజు, ప్రధాన కార్యదర్శి హుస్సేని, కోశాధికారి సాబువలీ డిమాండ్ చేశారు. సోమవారం ఎపియుడబ్ల్యుజె జిల్లా కమిటీ ఆదేశాల మేరకు తాలూకా, మండల కమిటీ సభ్యులతో కలిసి స్థానిక ఎంఆర్‌సి భవనంలో ఎంఇఒ ఖాజా మోహినుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రయివేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అమలు చేయాలని కోరారు. స్పందించిన ఎంఇఒ మోహినుద్దీన్ మాట్లాడుతూ... నియోజకవర్గ పరిధిలో ప్రయివేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యనందించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎపియుడబ్ల్యుజె మండల అధ్యక్షులు భీమరాయ్, ఉపాధ్యక్షులు నాగరాజు, సాగర్, రామస్వామి, కంతం నరసింహ, ప్రధాన కార్యదర్శి వడ్డే వెంకట రాజ్, కోశాధికారి రఫీ, సభ్యులు మహబూబ్, వెంకటేష్, వీరేష్, పరమేష్, కోటి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులోని పాత తహశీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్న ఎంఇఒ ఆంజనేయులును కలిసి వినతిపత్రం అందజేశారు. వారంలోపు ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసి వారిని ఒప్పిస్తామని ఎంఇఒ హామీఇచ్చారు. ఎపియుడబ్ల్యుజె తాలూకా అధ్యక్షులు బి.శ్రీనివాస నాయుడు, తాలూకా ప్రధాన కార్యదర్శి చిన్నాకుల నాగరాజు, పట్టణ అధ్యక్షులు ఒ.బి.పరమేష్, ఎపియుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షులు నూర్ అహ్మద్, తాలూకా వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రామకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.ఈరన్న, నాయకులు శివ, మగ్బుల్, అశోక్, బాబురాజు, సి.నాగరాజు, ఆవుల శ్రీనివాసులు, తిరుమల, వెంకటేష్, బాలాజీ, రవి కుమార్, అబ్దుల్లా, అరవింద్ గౌడ్, లక్ష్మన్న, వెంకటేష్, రహిమాన్, ఎం.రాజు, సునీల్ కుమార్, హరి, రంగన్న, రవీంద్ర రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.



మంత్రాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న నాయకులు